


# ఉత్తరీయం ఇస్త్రీ

**మా** ఇంట్లో మేమంటే అందరికీ అలుసే. అయ్యో, చిన్నపిల్లలు మనకింత చాకిరీ చేసి పెడుతున్నారు అనే అభిమానం అయినా లేదు. చీటికీ మాటికీ విసుక్కోడం, దొరికితే ఓ దెబ్బవెయ్యడం.

వాళ్ళకి మేడమీద పేకలాడుకునే పని ఉందనుకోండి– మమ్మల్నందర్నీ క్రింద ఉంచి 'పైకి వచ్చారో కాళ్ళు విరగ్గొడతాం' అంటారు. కింద ఎవరైనా పెద్ద మనుషులు వచ్చి వాళ్ళతో ముఖ్యమైన విషయాలు మాట్లాడాల్సి వస్తే మమ్మల్నందర్నీ పైకి తోలేసి 'కిందికి దిగితే కాళ్ళు విరగ్గొడతాం' అంటారు.

ఎంత పెద్దవాళ్ళయినా ఇంత నిరంకుశత్వాలు భరించడం కష్టం బాబూ. అందుకే అన్నీ మనసులో ఉంచుకుని బదులు తీర్చుకుంటూ ఉంటాం సమయం చూసి.

ఒకరోజు మిట్టమధ్యాహ్నం మా తాతయ్యగారు మమ్మల్ని పిల్చి "నా ఉత్తరీయం ఇస్త్రీ చేయించుకు రండి. రెండంచులూ పైకి రావాలి. పరంలా ఉండాలి" అని చెప్పి గంజి పెట్టి నుంచోబెట్టిన ఉత్తరీయం ఇచ్చారు.

ఆ ఉత్తరీయం అలా ఇస్త్రీ చెయ్యాలంటే పావలా అడుగుతాడు. ఆ మాటే చెప్పాం. "మీ మొహం. పావలానా ఇంకేమైనా? పదిహేను పైసలు చాలు. మా తాతయ్య ఇంతే ఇచ్చాడని చెప్పండి. దగ్గరుండి ఇస్త్రీ చేయించుకు రండి" అని చెప్పారు.

సరే బయలుదేరాం. మా ఇల్లు మూడో లైనులో. ఇస్త్రీ షాపు ఏడో లైనులో. వెళ్ళి విషయం వివరంగా చెప్పాం.

"పఠంలాగానే చేస్తాను. మరి పావలా తెచ్చారా" అని అడిగాడు.

"పావలా ఎక్కువట. పదిహేను పైసలేనుట. మా తాతయ్య చెప్పారు" అన్నాం.

"పదిహేను పైసల ఇస్త్రీ కావాలంటే హరహరమహల్ దగ్గర చెంబు ఇస్త్రీ వాడుంటాడు. అక్కడి కెళ్ళండి. నేను మాత్రం పావలాకి పైసా తగ్గను" అన్నాడు.

ఎంత చెప్పినా వినిపించుకోలేదు. హరహరమహల్ చాలా దూరం. ఎండగా ఉంది. అంతదూరం ఏం వెళ్తాం అనుకున్నాం. ఆ ఇస్త్రీ కొట్టు ఎదురుగా మరమరాలు, బఠాణీలు వగైరాలు అమ్మే కొట్టు ఉంది.

ఆ పదిహేను పైసలూ పెట్టి మరమరాలూ బఠాణీలూ కొనుక్కున్నాం. ఆ పక్కనే నీడన కూర్చుని తినేసి తీరిగ్గా ఇంటికొచ్చాం.

తాతయ్యగారు ఇస్త్రీ పంచె కట్టుకుని ముందు హాల్లో పచార్లు చేస్తున్నారు. మమ్మల్ని చూడగానే 'హమ్మయ్య వచ్చారా! ఏదీ ఉత్తరీయం? అన్నారు. ఉత్తరీయం ఇచ్చి విషయం వివరించాం.

మండిపడిపోయి 'ఎందుకూ పనికిరారు. తెలివితేటలు శూన్యం' అని తిట్టిపోసి పర్సు తీసి మరో అయిదు పైసల నాణెం నా చేతికిచ్చి "సరే ఇరవై పైసలూ ఇచ్చి చేయించుకురండి. అరిచి గీపెట్టినా అంతకుమించి పైసా ఇవ్వనన్నానని చెప్పండి" అన్నారు.

"ఆ పదిహేను పైసలూ ఎక్కడున్నాయ్. మరమరాలూ పప్పులూ కొనుక్కు తినేశాం" అని చెప్పేశాం. మరి కాసిని తిట్టి మళ్ళీ ఇంకో పదిహేను పైసలు పడేశారు. 'త్వరగా అఘోరించండి. పఠంలా ఉండాలి ఉత్తరీయం' అని చెప్పారు.

మళ్ళీ బయలుదేరాం. గమ్యం చేరాం. ఇస్త్రీ అబ్బాయికి అంతా చెప్పి "ఇదుగో ఇరవై పైసలు తీసుకో. పఠంలా ఇస్త్రీ చెయ్" అన్నాం.

"ఎన్నిసార్లు చెప్పాలమ్మా? పావలాకి పైసా తగ్గదని. ఊరికే విసిగించకండి. పావలాకి మొహం చూసుకుంటున్నారుగానీ పతంలా ఉండాలిట మళ్ళీనూ" అని విసుక్కున్నాడు.

అటు తాతయ్యా తిట్టి ఇటు ఇస్త్రీ అబ్బాయి తిట్టేసరికి మా మనసులు పాడైపోయాయి. 'ఏం చేద్దాం అంటే ఏం చేద్దాం' అనుకున్నాం. పాడై పోయిన మనసులు బాగవ్వాలంటే మళ్ళీ మరమరాలు కొనుక్కుతింటే చాలనిపించింది. ఇందాక తిన్నాంగానీ నాలుకకి అంటీ అంటినట్లుగా ఉంది. మళ్ళీ ఇరవై పైసలూ ఇచ్చి కొనేసుకున్నాం. 'ఇంకాసినివ్వు, ఇంకాసినివ్వు' అని కొసరి వేయించుకున్నాం.

అక్కడే నీడన కూర్చుని తినేసరికి హుషారొచ్చేసింది. కేరింతలు కొడుతూ ఇంటికి చేరాం.

తాతయ్యగారు ఇస్త్రీ చొక్కా కూడా వేసేసుకుని గేటు దగ్గరే పచార్లు చేస్తున్నారు. మమ్మల్ని చూసి "వచ్చేశారా? మరి నేనందుకే చెప్పింది. అడిగినంతా ఇచ్చేయకూడదు, బేరం ఆడాలి" అన్నారు- మా ఉత్సాహం చూసి పనయిపోయిందనుకుని.

తీరా అసలు విషయం తెలుసుకుని మండిపడ్డారు. "ఛ! పనికిరానిసంత పోగయ్యారు. దున్నమంటే దూడల్లా, మెయ్యమంటే ఎద్దుల్లా మీలాటి ఏబ్రాసి పిల్లలు ఇంకెక్కడా ఉండరు. గంటనించీ తిరుగుతున్నారు. పనిమాత్రం కానేలేదు. అసలు మిమ్మల్ని పంపడం నాదీ బుద్ధి తక్కువ. ఇదుగో అయిదు పైసలు-పోయి పావలా వాడి మొహాన తగలేసి..." అని చెప్తూండగానే ఆపేశాం.

"ఆ ఇరవై పైసలూ కూడా అయిపోయాయిగా. పప్పులు తినేశాం" అన్నాం.

వెంటనే ఠంగున శబ్దం వినిపించింది. ప్రమాదం గమనించి పక్కకు పరుగెత్తాం. తరవాత కాసేపటికి ఆ మొట్టికాయ తిన్న మా తమ్ముడు చేరుకున్నాడు. అంతదూరాన నిలబడి-"ఇప్పుడేం మించిపోయింది పావలా ఇవ్వండి, పోయి ఇస్త్రీ చేయించు కొస్తాం" అన్నాను.

"చచ్చినా ఇవ్వను. బుద్ధొచ్చింది. నేవెళ్ళి ఇస్త్రీ చేయించుకుని అట్నుంచి అటే పోతాను" అంటూ ధుమధుమలాడుతూ చెప్పులేసుకుని వెళ్ళిపోయారు.

'మా బాగా అయింది' అనుకున్నాం సంబరంగా.

* * *